నిండాముంచిన మిచాంగ్


పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు


పాలకొల్లు సెంట్రల్: నీట మునిగిన చేలో నిచ్చెన మోసుకెళ్తున్న విద్యుత్ సిబ్బంది


పెనుగొండ: సిద్ధాంతంలో ధాన్యం రాశిలోకి చేరిన నీటిని తోడుతున్న రైతులు


నరసాపురం రూరల్: లిఖితపూడిలో ధ్వంసమైన కొబ్బరిచెట్లు

- నీటమునిగిన పంటపొలాలు
- గ్రామాల్లో విరిగిపడిన చెట్లు, స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

పాలకొల్లు సెంట్రల్: మిచాంగ్ తుపాను సృష్టించిన ప్రళయం అటు అధికారులను ఇటు రైతులు, వ్యాపారస్తులు, ప్రజలను తేరుకోలేకుండా చేసింది. మంగళవారం తీరం దాటిన మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీని ప్రభావం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం రాత్రి నుంచి కంటి మీద కునుకులేకుండా కత్తిమీద సాములాగా శక్తివంచన లేకుండా చేసిన కృషితో బుధవారం నాటికి ఓ కొలిక్కి తీసుకువచ్చి విద్యుత్ సరఫరాను అందించారు. అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇస్తూ స్తంభాలులు దెబ్బతిన్న ప్రాంతాల్లో అర్ధరాత్రి అని లేకుండా వర్షంలో సమస్యను పరిష్కరించి సాధ్యమైనంత వరకూ తాత్కాలికంగానైనా విద్యుత్ సరఫరాను కొనసాగించారు. చెట్లు పడిపోయిన అన్ని ప్రాంతాల్లో చెట్లు కోసే కార్మికులను పంపించి ముందుగా స్తంభాలపై పడిపోయిన చెట్లను కోయించారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి కొత్త స్థంబాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను కొనసాగించారు. నియోజకవర్గంలో మొత్తం 66 విద్యుత్ స్తంభాలు పడిపోగా పది ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల సుమారు రూ. 20 లక్షల వరకూ నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మిచాంగ్ తుపాను మంగళవారం తీరం దాటడంతో రాత్రంతా భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా సుమారు 162.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని 17 గ్రామాల్లోనూ ప్రధాన రహదారులు, జగనన్న కాలనీలోను వర్షపు నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెంలోని జగనన్న కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో సర్పంచ్ పడవల మేరీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జయరాజు జేసీబీతో కచ్చా డ్రెయిన్ తవ్వించి నిలిచిన నీటిని బయటకు తోడారు. కాళీపట్నం పడమరలో ప్రధాన రహదారుల్లో నీరు నిలిచిపోవడంతో సర్పంచ్ కవురు సావిత్రితో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జేసీబీతో గోతులు తీసి మురుగు కాలువలోకి తోడించారు. మండలంలోని పాతపాడు గ్రామంలో యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో గ్రామంలో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేక గత నాలుగు రోజులుగా ముంపు నీటిలోనే తిరుగుతున్నారు.

పెనుగొండలో...

పెనుగొండ: మిచాంగ్ తుపానుతో అతలాకుతమైన ఆచంట, పెనుగొండ మండలాలు వాతావరణ శాంతించడంతో బుధవారం పంటను రక్షించుకోవడంలో రైతన్నలు నిమగ్నమయ్యారు. ఉదయం కొద్ది సమయం పాటు వాతావరణం మబ్బులతో నిండినా, 11 గంటల నుంచి సూరీడు దర్శనం ఇవ్వడంతో రైతన్నలు పొలం బాట పట్టారు. నేలనంటిన వరిదుబ్బులను నిలిపి కట్టుకోవడంలోనూ, రాశుల్లో ఉన్న ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టుకోవడానికి రాశుల చుట్టూ చేరిన వర్షపు నీటిని బయటకు తోడి పంటను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేశారు. రోడ్డుపై ఉన్న ధాన్యాన్ని అధికారుల సహకారంతో రైసుమిల్లులు తరలించారు. పుంత రోడ్డుల్లో ఉన్న ధాన్యం మరో రెండు, మూడు రోజుల పాటు బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. వర్షం శాంతించినా శివారు ప్రాంతాల్లో నిలిచిన నీరు ఇంకా బయటకు వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిద్ధాంతం అరుందతీపేట, శాలి పేట, ఆచంటలో ఉన్నత పాఠశాల, వడలి, చినమల్లం, నడిపూడిల్లోనూ శివారు కాలనీల్లో నీరు నిలిచిపోయి ఉంది.

నష్టాల అంచనాల్లో అధికారులు

పంట నష్టాలు గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో తహసీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓలు ఎస్.శ్రీనివాస్ దొర, వ్యవసాయాధికారులు పి.స్పందన, వి.నాగరాజులు గ్రామాల్లో రైతులతో కలసి వరిచేలను పరిశీలించి అంచనాలు వేయడంలో నిమగ్నమయ్యారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మిచాంగ్ తుపాను గ్రామాలను అతలాకుతలం చేసింది. ముఖ్యంగా వరి పంటకు తీవ్ర నష్టం కలిగించింది. సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కొబ్బరి, అరటి, కాయకూరలు తోటలు కూడా దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరింది. 10 విద్యుత్ స్తంభాలు నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు నేలకొరిగాయి. మేడపాడులో ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు నీట మునిగిపోయాయి. దీంతో గ్రామంలోని హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులకు సర్పంచ్ గంటా శాంతకుమారి భోజనాలు ఏర్పాటు చేశారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి సందర్శించి బాధితులను పరామర్శించారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: మండలంలో ఓ పక్క మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షాలు, మరోపక్క ఊహించని రీతిలో విరుచుకుపడిన టోర్నడోతో జరిగిన నష్టం వెరశి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఇదిలా ఉంటే మంగళవారం కురిసిన వర్షం ఆకాశానికి చిల్లు పడిందా? అన్న రీతిలో భారీగా కురిసింది. దీంతో నియోజకవర్గంలోని పంట చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాతావరణం ఎంత అనుకూలించినా చేలో ఉన్న వరిని ఇప్పట్లో బయటకు తీసుకువచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. మరో పక్క అధికారులు జరిగిన నష్టాలను అంచనా వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.


యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో తలలు వాల్చిన వరి చేను


యలమంచిలి: వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు


నరసాపురం రూరల్: మల్లవరంలో ధ్వంసమైన అరటి చెట్లు


పెనుగొండ: ధాన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

తుపాను బాధితులకు అండ


తుపాను బాధితులకు ఆహారం అందజేస్తున్న గుడాల గోపి

యలమంచిలి: తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు అన్నారు. మండలంలోని చించినాడ, మేడపాడు, పెనుమర్రు గ్రామాలలో బుధవారం ఆయన ఆయన పర్యటించారు. ఈ గ్రామాల్లో తుపాను వలన నష్టపోయిన వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతంతో పని లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. అలాగే మేడపాడులో తుపాను బాధితులకు ఆహారం అందించారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు


దగ్గులూరులో పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: తుపాను ప్రభావం కారణంగానూ, అలాగే అధిక వర్షాలు కారణంగా వాతావరణంలో మార్పులు రావడం వల్ల పశువులకు గొంతు వాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా.పి వరప్రసాద్ చెప్పారు. అధిక వర్షాల కారణంగా నిలిచిపోయిన మురుగునీరు, అలాగే అపరిశుభ్రంగా ఉన్న పశువుల పాకలు పరిసరాల ప్రభావంతో ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణమన్నారు. ఈ వ్యాధి గుర్తించిన వెంటనే పశువులకు సరైన చికిత్స అందించాలని ఆయన కోరారు.

9న దీపాలంకరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంలో ఏర్పాటుచేసే లక్ష దీపాలంకరణ శనివారం రోజుకు వాయిదా వేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్ల సూర్యనారాయణ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల బుధవారం ఆలయంలో నిర్వహించాల్సిన లక్ష దీపాలంకరణ శనివారం నాటికి వాయిదా వేసినట్లు తెలిపారు.

పంట పొలాల పరిశీలన


చిట్టీతగుంటలో అధికారులకు సూచనలిస్తున్న నరసాపురం ఆర్డీఓ అంబరీష్

పోడూరు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల నీట మునిగి దెబ్బతిన్న ప్రతీ ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నరసాపురం ఆర్డీఓ ఎం.అంబరీష్ అన్నారు. పెనుమదం శివారు చిట్టీతగుంట ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించి దెబ్బతిన్న వరి చేలను పరిశీలించారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రతీరైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఆర్ఐ కె.రాంబాబు ఉన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి

పెనుగొండ: పెనుగొండ గుర్రాల వారి వీధిలో సెల్ టవర్ నిర్మాణం నిలపాలంటూ వీధి వాసులు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. పరిసర ప్రాంత ప్రజలనుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేపట్టారని, దీనిపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని అధికారులకు వివరించారు. సత్వరం నిర్మాణం ఆపి పరిసర ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం సమర్పించారు.

పంటబోదెలో పూడిక తొలగింపు

పోడూరు: పెనుమదం శివారులో పంటచేలల్లో ముంపునీటిని వేగవంతంగా బయటకు తరలించేలా బుధవారం అధికారులు అల్లిపర పంట బోదెను జేసీబీతో ప్రక్షాళన చేశారు. నరసాపురం ఆర్డీఓ ఎనే అంబరీష్ పర్యటించి ఆదేశాలు జారీచేయడంతో పంటబోదెలో పూడిక తొలగించేలా జేసీబీతో యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించినట్లు ఎంపీడీఓ డి.సుహాసిని, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పితాని చిన్నా, సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ పనులను పర్యవేక్షించారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం


లంకలకోడేరులో నీటమునిగిన వరిచేలను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట ముంపునకు గురై తడిసిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని లంకలకోడేరు, వెలివెల, తిల్లపూడి, శివదేవునిచిక్కాల గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. లంకలకోడేరు నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. అలాగే ధాన్యపు రాసులను పరిశీలించి తక్షణం పట్టుబడి పట్టి మిల్లులకు పంపించాలని ఆదేశాలిచ్చారు. అలాగే వెలివెల, తిల్లపూడి, శివదేవునిచిక్కాల గ్రామాల్లో సుడిగాలుల కారణంగా నేలకొరిగిన కొబ్బరిచెట్లు, ఫలవృక్షాల రైతులను, ఇల్లు నష్టపోయిన యజమానులను మంత్రి నాగేశ్వరరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని హామీ ఇచ్చారు. మరో మూడు రోజుల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పంట నష్టం అంచనాలను సిద్ధం చేయాలన్నారు. అలాగే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. 22 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తోలించాలని, ఆ పైన ఎక్కువ ఉన్న తేమశాతానికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రైస్ మిల్లుల యజమానులు రైతులను ఏమైనా ఇబ్బంది పెడితే ఆ రైస్‌మిల్లులను సీజ్ చేయాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీస్‌కి ఆదేశాలిచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం సీరియస్ ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకోవాలన్నారు. మంత్రి కారుమూరి వెంట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, నాయకులు యడ్ల తాతాజీ, పెంట్ర వీరన్న, గుమ్మాపు సూర్యవరప్రసాద్, చొప్పల రజని, కూనపరాజు సత్యనారాయణరాజు, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, విప్పర్తి ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

పంట నష్టం అంచనాల్లో భరోసా ఇవ్వాలి


ఆడుదాం - ఆంధ్రా కిట్‌లను సర్పంచ్‌లకు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టం అంచనాలు రూపొందించడంలో అధికారులు రైతులకు పూర్తి భరోసా ఇవ్వాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కనకలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసిన కారణంగా గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంటుందని, దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింట సర్వే నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు మాట్లాడుతూ వర్షాకాలంలో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరచడం, కచ్చా డ్రెయిన్‌ల నిర్వహణ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముందుగా బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీపీ కనకలక్ష్మి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆడుదాం ఆంధ్రా కిట్‌ల పంపిణీ

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 రోజుల పాటు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి క్రీడా సామగ్రి కిట్‌లను గ్రామ సర్పంచ్‌లకు కనకలక్ష్మి, మేకా శేషుబాబు అందజేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడపిల్లలను చదివిద్దాం-ఆడపిల్లలను రక్షిద్దాం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి సాయిబాబు, మేడిది స్వర్ణ, ధనలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్ రాజు, మండల ప్రత్యేకాధికారి ఎ లక్ష్మి, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంట పొలాల పరిశీలన


పెనుమంట్ర: ఎస్.ఇల్లిందలపర్రులో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: తుపాను కారణంగా నష్టపోతున్న రైతులు అధైర్యపడవద్దని రైతుల వద్ద ధాన్యాన్ని ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆయన పెనుమంట్ర మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి రైతులను వివరాలను అడిగి తెలుసుకుంటూ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. నష్టపోయిన రైతుల వివరాలను తక్షణం నమోదు చేయాలని మురగుకాలువలు, తవ్వకాలకు చర్యలు చేపట్టి వరిచేలలో నీరు త్వరితగతిన బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎస్.ఇల్లిందలపర్రు, మల్లిపూడి, నత్తారామేశ్వరం, మాముడూరు, పొలమూరు, పెనుమంట్ర, ఆలమూరు, భట్లమగుటూరు, వెలగలేరు గ్రామాలలో రైతులను కలిసి, వివరాలను సేకరించారు. ఆయన వెంట పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పెనుమంట్ర: వెలగలేరు గ్రామంలో రూ. 1.50 కోట్లతో పునర్నిర్మించే రామేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రముఖుడు దాత తాడి ఫణికుమార్‌రెడ్డి, లక్ష్మి తులసీదేవి దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు ప్రక్కనే లోలెవల్‌లో ఉన్న ఈ ఆలయాన్ని పునఃనిర్మించేందుకు గ్రామస్తులు రూ. 50 లక్షలు విరాళం చెల్లించేలా శ్రీరంగనాథరాజు కృషితో దేవాదాయశాఖ కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్ కొవ్వూరి మధువాణి, సొసైటీ మాజీ అధ్యక్షులు కొవ్వూరి పుత్రారెడ్డి, విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణు మాధవ రెడ్డి, కర్రి సురేష్ రెడ్డి, అల్లం బులిరెడ్డి, పడాల కేశవరెడ్డి, కొవ్వూరి చంద్రమౌళీశ్వరరెడ్డి, కర్రి వేణుబాబు పాల్గొన్నారు.

సగంచెరువులో వై ఏపీ నీడ్స్ జగన్


సగంచెరువులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కదలి నాగమణి

పాలకొల్లు అర్బన్: అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరలా సీఎంగా ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు చెప్పారు. పాలకొల్లు మండలం సగంచెరవు గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సగంచెరువు, గోరింటాడ గ్రామాలకు ప్రత్యక్షంగా రూ.12,62,65,725, అలాగే పరోక్షంగా ర ఊ.4,06, 61,109, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.5 లక్షలు, మొత్తంగా రూ.18,11,06,834 ప్రయోజనం చేకూరిందన్నారు. సర్పంచ్ కడలి నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడలి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ శీలం సత్యనారాయణ, చవ్వాకుల రామారావు, సానబోయిన జగన్నాథం, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, కర్షి జోగయ్య, ఏనుగుపల్లి చంద్రశేఖర్, నోడల్ అధికారి కె మాణిక్య వైభవతి, పంచాయతీ కార్యదర్శి మొల్లేటి సేవా కిషోర్, సచివాలయ కార్యదర్శి కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


పెనుగొండ: పెదమల్లంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


పాలకొల్లు అర్బన్: గాంధీ బొమ్మల సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చెల్లెం ఆనందప్రకాష్

పెనుగొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాలకు సముచిత స్థానాన్ని కల్పించి అందరివాడుగా నిలిచిపోయిన మహనీయుడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆచంట మండలం పెదమల్లంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరిపెద్దిరాజు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పెదమల్లం సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మీ పాల్గొన్నారు. కొడమంచిలిలో సర్పంచ్ సుంకర సీతారామ్ ఆధ్వర్యంలోనూ యువసేన ఆధ్వర్యంలో ఆచంటలో సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోనూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

పెనుగొండ మండలంలో

ఇలపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. యువజన కమిటీ సభ్యులు పీతల ప్రభాకర్, సంఘ పెద్దలు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, గున్నం అశోక్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, దిడ్ల ప్రసాద్, పులిదిండి కృష్ణ, చికిలే సుదర్శన్, చిట్టా నర్సింహమూర్తి, పీతల సురేష్, నల్లి సంపత్ రావులు పాల్గొన్నారు. పెనుగొండలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ ఆధ్వర్యంలోనూ, దేవలో సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, ఉప సర్పంచ్, సాక సుబ్రహ్మణ్యం,గొడవర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో, ములపర్రులో కేశరపల్లి గిరి రవీంద్ర, కోలాటి అబ్బులు, తవిటికి సత్యనారాయణ బొక్కా దాసులు, మద్రే శ్యాంబాబు, షేక్ బాబు, ఊటాల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ 167వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పడవల మేరీ,ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జయరాజులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నరసాపురం హౌసింగ్ కార్యాలయంలో పీడీ ఆర్‌సీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ప్రజల మధ్య అంతరాలు పోగొట్టి సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విప్పర్తి ప్రభాకరరావు, ఎం.మైఖేల్‌రాజు, చిట్టూరి ఏడుకొండలు, కె.వినిస్టన్‌బాబు, ముచ్చర్ల శ్రీరామ్ గుమ్మాపు పెద్దిరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ నాయకులు చినిమిల్లి గణపతిరావు, బండి రమేష్, కోట రత్నం రాజు,రామాంజుల పెదమధు తదితరులు పాల్గొన్నారు.